క్లుప్తంగా

మే డే పోస్టర్ ఆవిష్కరణ



జి.మామిడాడలో మే డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదపూడి: మే డే వేడుకలను అందరూ ఘనంగా నిర్వహించాలని ఏపీఆర్‌సీఎస్ జిల్లా నాయకుడు మడికి సత్యం, పారిశుధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చా ఏసు పిలుపునిచ్చారు. జి.మామిడాడలో ఏఐఎఫ్‌టీయు, ఏపీ ఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో మే డే పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 1 నుంచి ఆరో తేదీ వరకు వివిధ గ్రామాలు, నగరాల్లో కార్మిక, కర్షకుల ఐక్యతతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సూరిబాబు, అప్పారావు, తేజ పాల్గొన్నారు.

రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడి మృతి తీరని లోటు

రంగంపేట: రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు తోటకూర నాగేశ్వరరావు ఆకస్మిత మృతి కాపునాడు లోకానికి తీరని లోటని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాజానగరానికి చెందిన తోట నాగేశ్వరరావు కాపునాడు ఉపాధ్యక్షుడిగా ఎన్నో సేవలు అందించారని, ఆయన ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను సానుభూతి తెలియజేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో డివిజన్ కాపునాడు అధ్యక్షుడు వల్లభశెట్టి రామ సతీష్, మండల కాపునాడు అధ్యక్షుడు మాగాపు కాశి ఉన్నారు.

పాలిసెట్‌కు గైట్‌లో రెండు కేంద్రాలు

రాజానగరం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించే పాలిసెట్ 2025కు స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారని చీఫ్ సూపరింటిండెంట్‌గా వ్యవహరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం తెలిపారు. పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించిన గైట్ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్కె బ్లాక్‌ల్లో 1791 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ పరీక్షకు హాజరయ్యేవారు పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వడిశలేరులో శనివారం సారా స్థావరాలు, వ్యాపారులపై దాడులు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన కురుకూరి దుర్గ అనే మహిళ నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

వైభవంగా వేల్పులమ్మ ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న వేల్పులమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం అన్నసమారదన నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించిన అనంతరం అన్నదానం ప్రారంభిస్తామన్నారు.

డివైడర్‌ను ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు

రాజానగరం: స్థానిక ఏడీబీ రోడ్డుపై స్థానిక టుబాకో గోడౌన్స్ సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సిమెంటు డివైడర్‌ను మోటార్ సైకిల్‌తో ఢీ కొని రామస్వామిపేటకు చెందిన ఆదాడి శివ (21) తీవ్రంగా గాయపడ్డాడు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన నేపథ్యంలో పనులు అసంపూర్తిగా జరిగిన ప్రాంతాల్లో సిమెంట్ డివైడర్స్‌ను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి శివ మోటార్‌సైకిల్‌పై రాజానగరం నుంచి రామస్వామిపేట వెళ్తున్న సమయంలో చీకట్లో డివైడర్లు కనిపించక ఢీ కొట్టి, పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే అతడిని 108లో జగ్గంపేటలోని ఆస్పత్రికి తరలించారు. రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

బిక్కవోలు: వివిధ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 338 మంది హాజరైనట్టు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.శనివారం మండలంలోని 2024–25 ఆర్థిక సంవత్సరం బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్, రుణాలకు 595 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 338 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఆరికరేవుల నుంచి 10, బలభద్రపురం 28, బిక్కవోలు 116, ఇలపల్లి 8, కాపవరం 8, కొమరిపాలెం 42, కొంకుదురు 19, మెళ్లూరు 8, పందలపాక 31, ఆర్‌ఎస్‌పేట1, రంగాపురం 25, తొస్సిపూడి 9, ఊలపల్లి నుంచి 33 మంది హాజరయ్యారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- దోపిడీయే లక్ష్యంగా సాగుతున్న దందా
- అధికారం అండతో పేట్రేగిపోతున్న మట్టి మాఫియా
- కొండలు, గుట్టలు మాయం
- నిబంధనలకు విరుద్ధంగా తరలింపు
- పట్టించుకోని అధికారులు



లారీల రాకపోకలతో ధ్వంసమైన కలవచర్ల రోడ్డు



పోలవరం కాలువ గట్టును తవ్విన దృశ్యం

రాజానగరం: ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి దొరికినంత దోచుకోవడమే అన్నట్టుగా ఉంది నియోజకవర్గంలోని పాలకుల తీరు. కూటమి నాయకుల అండదండలతో పేట్రేగిపోతున్న దోపిడీదారులకు అడ్డుచెప్పేవారు కరువయ్యారు. ఒకవైపు గోదావరిలో ఇసుక తోడేస్తూ అది సరిపోదన్నట్టుగా మట్టి మాఫియా గ్రామాల్లోని కొండలు, కాలువ గట్లను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధింత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మట్టి మాఫియా సాగిస్తున్న అక్రమ రవాణాలకు రోడ్లు ధ్వంసమై దుమ్ము, ధూళి ఎగసి పడుతూ, తమ ఆరోగ్యాలు దెబ్బతీస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

తరలిపోతున్న పోలవరం కాలువ గట్టు

పోలవరం కాలువ ఏర్పాటుచేసే సమయంలో ఇరువైపులా తాడెత్తున గట్లను ఏర్పాటు చేశారు. వీటిలో కలవచర్ల, గాదరాడ ప్రాంతాల్లో ఎర్ర గ్రావెల్ ఉండటంతో అది ప్రస్తుతం మట్టి మాఫియాకు వరాల పంట అయింది. అర కొర అనుమతులతో ఈ ప్రాంతాల్లో గట్టును తవ్వడంతోటు భూగర్భం వరకూ తవ్వి గ్రావెల్ అక్రమ రవాణాకు తెరలేపారు. ఈ ప్రాంతాల నుంచి నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా 200 నుంచి 250 లారీల్లో ఎర్ర గ్రావెల్ తరలిపోతుంది. ఒక్కో లారీ గ్రావెల్ ఖరీదు దూరాన్ని బట్టి రూ. 30 వేలు నుంచి రూ. 40 వేల వరకు వసూలు చేస్తారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో రోడ్లు చిన్నాభిన్నమై, కంకర రాళ్లు లేచి, దుమ్ము, ధూళి ఎగసిపడుతోంది. దీనితో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. రోడ్ల పక్కన ఉన్న ఇల్లు మట్టి మయమవుతుంటే, ఆ ధూళిని పీల్చడంతో తమ ఆరోగ్యం దెబ్బతింటోందని కలవచర్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు గ్రామస్తులు ఈ అక్రమ దందాను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అధికార పార్టీ అండతో ప్రజల ఆవేదన అరణ్య రోదనగా మిగిలింది.


రోడ్లు ధ్వంసమయ్యాయి



రోజూ రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది లారీల్లో మట్టి, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తుండటంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. కంకర రాళ్లు లేచిపోయి, దుమ్ము, ధూళి ఎగసిపడుతోంది. దీని వలన రోడ్లపై ప్రయాణం చేయలేకపోతున్నాం. గ్రామస్తులు అనారోగ్యం పాలవుతున్నారు.

– దాట్ల రఘు, కలవచర్ల

కూటమి అండతోనే ఈ దందా



నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలోని స్థానిక పెద్దల అండదండలతోనే మట్టి మాఫియా దందా కానసాగుతోంది. కొండగుంటూరు, జి.యర్రంపాలెంలో కొండలు తవ్వేశారు. ఇప్పుడు పోలవవరం కాలువ గట్టును తవ్వేస్తున్నారు. వీటిపై ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– అదబాల చినబాబు, సీతారామపురం

సత్యసాయి బోధనలు ప్రచారం చేస్తూ రథయాత్ర



దివాన్‌చెరువు చేరుకున్న రథయాత్ర

రాజానగరం: సత్యసాయిబాబా బోధనలను దేశ వ్యాప్తంగా ప్రచారం చేసి, ప్రజల్లో ఆధ్యాత్మిక, సేవా గుణాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో చేపట్టిన సత్యసాయి ప్రేమవాహిని రథయాత్ర నిర్వహిస్తున్నామని యాత్ర ప్రతినిధి లలాట హిందూరావు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ రథయాత్రకు శనివారం దివాన్‌చెరువులో స్థానిక సత్యసాయి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక, విద్య, వైద్య, సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే సంకల్పంతో ఈ యాత్రను సెంట్రల్ ట్రస్టు ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పలువురు సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మూడు తాటాకిళ్లు దగ్ధం



పశ్చిమగానుగూడెంలో అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: పశ్చిమగానుగూడెం బీసీ పేటలో శుక్రవారం అర్ధరాత్రి 3 తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.4 లక్షలు నష్టం ఏర్పడిందని బాధితులు తెలిపారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు. సంఘటన వివరాలను స్థానికులను అడిగి తెలుకున్నారు. అగ్నిప్రమాద బాధితులు వనుం నాగు, వనుం శ్రీను, టేకుమూడి మహాలక్ష్మిని ఓదార్చారు. ప్రభుత్వం బాధితులకు సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. నిద్రమత్తులో ఉండగా ప్రమాదం సంభవించడంతో ఎలా జరిగిందో ఆలోచించలేకపోయామని, ఇళ్లలో నుంచి బయటకు పరుగు పెట్టుకుంటూ వచ్చామని బాధితులు తెలిపారు. ఇళ్లలో బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు, ఫర్నీచర్ కాలిబూడిదయ్యిందని వాపోయారు. కట్టుబట్టలతో మిగిలామని బాధితులు అన్నారు. వనుం నాగు ఇంట్లోని రూ.70 వేలు, వనుం శ్రీను ఇంట్లోని రూ.20 వేలు నగదు దగ్ధమైనట్టు బాధితులు తెలిపారు. రాజాతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు తులూరి గంగరాజు, కన్నాబత్తుల గణేష్, మేడిశెట్టి శ్రీను, బత్తిన చిన్ని పాల్గొన్నారు. బాధితులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, స్థానికులు పరామర్శించారు.

కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై పోరాడతాం

- ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

సీతానగరం: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజల పక్షాన పోరాడతామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం రఘుదేవపురంలో నా కార్యకర్తలు – నా కుంటుంబం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమేనని, గెలిచినా, ఓడినా జక్కంపూడి కుటుంబం ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. రాజకీయాల్లో నిబద్ధత కలిగి ఉండి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో పార్టీకి బలమైన నాయకత్వం ఉందని, నాయకులు, కార్యకర్తల మధ్య ఎటువంటి బేధాభిప్రాయాలకు తావు లేకుండా వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలసి ప్రజలను మభ్యపెట్టి మోసపూరిత హామీలతో నమ్మబలికి అధికారాన్ని చేజిక్కించుకున్నాయని అన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోని వచ్చిన కూటమి నేతలు, ఆ తర్వాత అన్ని వర్గాలను మోసగించారన్నారు.



రఘుదేవపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

పది నెలలకే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. సీఎం తనయుడు లోకేష్ సూపర్ సిక్స్ పథకాలు అమలు కాని పక్షంలో కాలర్ పట్టుకుని నిలదీయాలని బహిరంగంగానే చెప్పారని, తొందరలోనే ప్రజలు నిలదీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని అన్నారు. రానున్న కాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరితో కలసి కూటమి ప్రభుత్వ ఆరాచకాలను నిలదీసే కార్యక్రమం చేపడతామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పిండి రాధాకృష్ణ, పిచ్చుకుల విజయ్ కుమార్, పాలచర్ల అచ్యుతరామారావు, పిన్నింటి పైడిరాజు, దాసరి బాబి, చిట్టూరి శ్రీను, యాలమాటి కాశీ, పంతుల శ్రీను, గుమ్మడి రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శ

మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. శనివారం సీతానగరంలో కొడమంచిలి శ్యామలరావు ఇటీవల మరణించగా వారి కుమారుడు రాంబాబును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అధికారి శ్రీను మేనల్లుడు ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెలమపేటలో అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కోడూరి సన్యాసిరావు, పాక్షికంగా డాబా ఇల్లు దెబ్బతినడంతో బాధితురాలు ఈశ్వరమ్మను ఆయన పరామర్శించారు. సన్యాసిరావుకు తక్షణ సహాయంగా బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. రఘుదేవపురంలో ఇటీవల మరణించిన సిద్దె వెంకటన్న, ముత్యాల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ గంటా శ్రీను, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, చల్లమళ్ల సుజీరాజు తదితరులు పాల్గొన్నారు

ప్రతిభావంతులకు ఘన సత్కారం



బిక్కవోలులో విద్యార్థులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు, నాయకులు

బిక్కవోలు: ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం ఘనంగా సత్కరించారు. పాఠశాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం నిర్వహించారు.మండల స్థాయిలో ప్రభుత్వం పాఠశాల నుంచి అత్యధికంగా 582 మార్కులు సాధించిన దాసరి జయమణి మంగతో పాటు, 500 మార్కులు పైగా సాధించిన వైవీఎస్ వినయ్, వరదాలావణ్య, పిల్లి చైతన్య శృతి, మురపాల బాలసాయి శివాని, శివాని, సర్లెల లావణ్యను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లి వీరబాబు, వైస్ చైర్మన్ వీరలక్ష్మి, డాక్టర్ వానపల్లి శ్రీనివాసరావు, పల్లె శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, సింగరపు రామారావు, పాఠశాల హెచ్‌ఎం పీవీ ప్రభాకర్, ఉపాధ్యాయుడు జంగా శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

25 శాతం సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

రాజానగరం: విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలో వెనుకబడిన వర్గాలు, అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, బలహీన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీల పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. వీటికోసం అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవులు అనంతరం ప్రారంభమయ్యే తరగతుల కోసం అవసరమైన పాఠ్యపుస్తకాలు తమ కార్యాలయానికి చేరాయని ఎంఈఓలు తెలిపారు. 28,227 పాఠ్య పుస్తకాల కోసం అవసరం కాగా మొదటి విడతగా 20,045 పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్, యూనిఫారం, బెల్టులు, బూట్లు, స్కూల్ బ్యాగ్స్‌తో కలిపి వస్తాయన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరిట వీటిని ప్రతి విద్యార్థికి ఉచితంగా అందజేస్తామన్నారు.

పండ్లను మాగబెట్టేందుకు రసాయనాలు వినియోగించొద్దు

జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మామిడి పండ్లను రసాయనాలతో మాగ బెట్టి విక్రయించిన వారిపై, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్, ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం కృత్రిమంగా పండ్లను మాగబెట్టడం ఆరోగ్యానికి హానికరం అనే అంశంపై రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ సహజ సిద్ధంగా పండ్లను మాగపెడితే ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి హాని కలుగుతుందని పేర్కొన్నారు. ఆ కోణంలో వ్యాపారులు ఆలోచించాలన్నారు. కృత్రిమంగా పండ్లను మాగబెట్టడం ఆరోగ్యానికి హానికరమని దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు సహజంగా పండిన పండ్లను ఎంచుకోవాలన్నారు. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్‌వంటి రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టడం చాలా సాధారణమని ఈ పద్ధతి వల్ల పండ్లలో హానికరమైన రసాయనాలు చేరి, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో మాగబెట్టిన పండ్లను తింటే, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు, జీర్ణ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవాలని తెలిపారు. జిల్లా ఆరోగ్య భద్రత అధికారి వి.రుక్కయ్య మాట్లాడుతూ రసాయనాలతో పండ్లు మాగపెట్టి విక్రయించే వ్యాపారులకు ఆరు నెలలు జైలు, రూ.5 లక్షలు జరిమానా, లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఎథలిన్ గ్యాస్ చాంబర్లు, రైఫిన్ ప్యాకెట్లు, గడ్డిలో వేసి పండ్లను మాగబెట్టాలని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి బి.సుజాతకుమారి, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ సురేష్‌కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆంజనేయులు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

శారీరక, మానసికాభివృద్ధికి క్రీడలు దోహదం

- కాకినాడ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్
- ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



జి.మామిడాడలో ప్రాజెక్ట్ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడా జ్యోతి వెలిగిస్తున్న శ్రీనివాస్‌కుమార్



ఉత్సాహగా కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

పెదపూడి: విద్యార్థుల శారీరక, మానసిక పురోగాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని, విద్యా రంగంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని కాకినాడ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. జి.మామిడాడ డీఆర్‌కే రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో శనివారం ఉత్సాహంగా ప్రాజెక్ట్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్‌ను క్రీడాకారులకు కేటాయించినట్టు తెలిపారు. జిల్లా కేంద్రమైన కాకినాడలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ప్రతిభగల ఎంతో మంది కోచ్‌లు ఉన్నారన్నారు. వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. సమాజానికి ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులను అందించడానికి వారు కృషి చేస్తున్నారన్నారు. డీఆర్‌కేరెడ్డి కాలేజి ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ద్వారా ఎంతో మంది ప్రతిభగల వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్నారన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాలో 210 పీడీ పోస్టులు, జోన్–2లో 26 పీఈటీ పోస్టులున్నాయన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో సత్తాచాటిన విజేతలకు బి.శ్రీనివాసుకుమార్ పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీఎల్‌రెడ్డి డిగ్రీ, డీ సీతయమ్మ జూనియర్ కాలేజిల ప్రిన్సిపాల్స్ డాక్టర్ టి.శ్రీనివాస్‌రెడ్డి, పి.త్రివేణి, ఇల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసారెడ్డి, ప్రముఖ న్యాయవాది మండా రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్ కర్రి సురారెడ్డి, ద్వారంపూడి యువరాజరెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రఘుదేవపురం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సీతానగరం: రఘుదేవపురం సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల చెక్ పవర్ తొలగించినట్టు ఎంపీడీవో ఎం.భారతి శనివారం తెలిపారు. ఇల్లా రఘుదేవపురం పంచాయతీలో రూ 1.03 కోట్ల నిధుల దుర్వినియోగమైనట్టు గుర్తించి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసినట్టు డీపీవో ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ అనంతరం గతంలో పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఎంపీడీవో భారతికి పంచాయతీ చెక్ పవర్ బాధ్యతలు అప్పగించారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ



తూర్పుగానుగూడెం వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజానగరం: జమ్మూ కాశ్మీర్ ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. పాకిస్తాన్‌కి చెందిన వారిని తక్షణమే భారతదేశం వదలి వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం వద్ద ఉత్తమ మండల డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రాజానగరం పరిసరాల్లో ఉన్న లాడ్జీలను, గెస్ట్ హౌస్‌లను నిశితంగా తనిఖీ చేస్తున్నారు. సీఐ వీరయ్యగౌడ్, ఎస్సైలు మనోహర్, నాగార్జున పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్.లావణ్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జీవితాలను విచ్ఛిన్నం చేస్తున్న మాదకద్రవ్య అలవాట్లను మానుకోవాలని, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్.లావణ్య పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఈగల్ టీం (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో శనివారం ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించినా, ఇతరులకు సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు మైకంలో నేరాలు చేసి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఖైదీలతో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అడిషనల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ పీఎస్.రాహుల్, వైద్యాధికారి కే సుబ్బరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ రత్నరాజు, జైలు ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.